సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 13 । అక్టోబర్ । 2025



కాసులు కురిపిస్తున్న పీచు

పీచు కాసులు కురిపిస్తోంది. కొబ్బరి తాళ్లకు డిమాండ్ పెరుగుతోంది.

- 8లో



వైఎస్సార్‌సీపీ పాలనలోనే..

వైఎస్సార్‌సీపీ పాలనలోనే కళింగ వైశ్యులకు గుర్తింపు వచ్చిందని నాయకులు అన్నారు. చంద్రబాబువి రాజకీయాలేనని అన్నారు.

- 8లో

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

అత్తమామలపై జనసేన నేత దాడి

ఇచ్ఛాపురం: పిల్లనిచ్చిన అత్తమామలపై దాడికి పాల్పడిన జనసేన నేతపై కేసు నమోదైంది. ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి దాసరి రాజుకు పట్టణంలోని అప్పన్నపేటకు చెందిన మోహినితో 2018లో వివాహమైంది. రూ.5 లక్షల కట్నమిచ్చి పెద్దల సమక్షంలో వివాహం జరిపించారు. 2023లో మోహినిని రాజు అదనపు కట్నంతో పాటు ఆమె తల్లిదండ్రుల ఆస్తిలో వాటా తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధించడం మొదలుపెట్టాడు. వాటిని తీసుకొచ్చేవరకు ఇంటికి రావద్దని ఇద్దరు ఆడపిల్లలతోపాటు భార్యను పుట్టింటికి పంపించేశాడు. ఈ క్రమంలో తనకు భార్య నుంచి విడాకులు కావాలని కోరుతూ ఈ ఏడాది సోంపేట కోర్టులో రాజు కేసు వేశాడు. ఇది విచారణలో ఉండగా రాజు, అతని అన్నయ్య కుమారుడు దీపక్, అతని చెల్లి రోజా, తల్లి ఆదిలక్ష్మితో కలిసి శనివారం తన ఇంటికి వచ్చి తన తల్లిదండ్రులు కాళ్ల అప్పారావు, రవణమ్మతో వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడి, తనను కొట్టాడని పోలీసులకు మోహిని ఫిర్యాదు చేశారు. దీంతో ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌లో దాసరి రాజు తదితరులపై కేసు నమోదైంది.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



క్యూలో భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు, అర్చనలు జరిగాయి. ప్రత్యేకంగా ఆదివారం ఉదయం 6 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనాలకు అనుమతి ఇవ్వడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆదిత్యుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆరోగ్యం కోసం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు మంచి నీరు, ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

13 నుంచి 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' ఉత్సవాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జీఎస్టీ 2.0 విజయోత్సవాలను పురస్కరించుకుని 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' పేరుతో నెల రోజుల ఉత్సవాలను జిల్లాలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో భాగంగా అక్టోబర్ 13 నుంచి 19 వరకు ఎన్‌టీఆర్ మున్సిపల్ గ్రౌండ్స్, ఏడు రోడ్ల జంక్షన్ వద్ద ప్రత్యేక ప్రదర్శనలు జరగనున్నట్లు తెలిపారు. ప్రజలకు జీఎస్టీ వల్ల కలిగిన సేవింగ్స్‌ను చూపించడానికి ప్రతి స్టాల్‌లో ప్రీ జీఎస్టీ ధర, పోస్ట్ జీఎస్టీ ధర, సేవింగ్స్ శాతం వివరాలు చూపించనున్నారు. ఆటోమొబైల్స్ స్టాళ్ల ఏర్పాటుకు రవాణా శాఖ, ఎలక్ట్రానిక్స్, కిచెన్ వస్తువులు, మొబైల్ ఫోన్ల స్టాళ్లకు కమర్షియల్ టాక్స్ విభాగం, మున్సిపల్ కమిషనర్, 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' కింద ఏపీసీఓ, లేపాక్షి సంస్థలు, పొందూరు చేనేత, ఇత్తడి, హస్త కళల వస్తువులు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.


రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి పర్యటన నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పౌర సరఫరాల శాఖపై ప్రాంతీయ సమావేశం సోమవారం ఉంటుందని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్ ఆదివారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఏఎస్‌ఆర్, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ పాల్గొంటారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సాయంత్రం 3 గంటలకు మిల్లర్స్ అసోసియేషన్, ధాన్యం సేకరణ సంస్థలు, రైతు సంఘాలతో సమావేశాల్లో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

పొందూరు: లోలుగు గ్రామానికి సమీపంలో ద్విచక్రవాహనం, ఆటో ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న లోలుగు గ్రామానికి చెందిన లోలుగు హరికృష్ణ, చోల్ల ప్రసాద్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన ఎం.జగన్‌మోహనరావులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

నిద్దరోతున్న నిఘా



- మెడికల్ షాపులపై కొరవడుతున్న నిఘా
- ఫార్మసిస్టులు లేకుండానే చాలా షాపుల నిర్వహణ
- ఇన్‌స్పెక్షన్లు.. కలెక్షన్లపై షాపుల నిర్వాహకుల ఆందోళన

శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లాలోని మెడికల్ షాపులపై నిఘా కొరవడుతోంది. జిల్లాలో 1600కు పైగా మెడికల్ షాపులు ఉన్నాయి. మరికొన్ని షాపులకు అనుమతి ఇవ్వాలన్నా.. ఉన్న వాటిని పర్యవేక్షించాలన్నా డ్రగ్ అధికారుల పాత్ర కీలకం. కానీ జిల్లాలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. పర్యవేక్షణ, తనిఖీ, ఫిర్యాదుల స్వీకరణ, రిప్రజెంటేటివ్‌లతో సమావేశాలు వంటి బాధ్యతలన్నీ చూడాలంటే అయ్యే పనికాదు. జిల్లాల విభజనకు ముందు మన జిల్లాలో శ్రీకాకుళం, పాలకొండ, టెక్కలి డివిజన్లు ఉండేవి. ఇప్పుడు పాలకొండ మన్యం జిల్లాలో కలవడంతో శ్రీకాకుళం, టెక్కలి, కొత్తగా పలాస డివిజన్లుగా ఉన్నాయి. మూడు డివిజన్లకు ముగ్గురు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు (డీఐలు), ఒక అదనపు డ్రగ్ కంట్రోలర్(ఏడీ) ఉండాలి. కానీ ఇక్కడ పరిస్థితి భిన్నం. ఓ ఏడీ, ఓ డీఐ ఓ జూనియర్ అసిస్టెంట్ ఉన్నారు. వీరు కాక ఒకరిద్దరు ఔట్‌సోర్సింగ్, కోర్టు కేసులు చూసే ఓ పోలీస్ కానిస్టేబుల్.. అంతే.

కొరవడిన పర్యవేక్షణ ..

డాక్టర్ ఇచ్చిన చీటీ పట్టుకుని మెడికల్ షాపునకు వెళ్తే అక్కడ కచ్చితంగా ఫార్మాసిస్టు ఉండాలి. అతడి పేరున లైసెన్స్ ఉండాలి. కానీ జిల్లాలో దాదాపు 40 శాతం దుకాణాలు ఫార్మాసిస్టులు లేకుండానే నడుస్తున్నట్లు సమాచారం. షాపులో సర్టిఫికెట్‌లో ఉన్నది ఒకరు.. అమ్మకాలు చేస్తుంది మరొకరుగా కనిపిస్తారు. ఫార్మసీ కౌన్సిల్ నుంచి పర్యవేక్షించాల్సిన ఫార్మసీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడం విడ్డూరం. డ్రగ్ వాళ్లు ఉన్నా తనిఖీలకు వెళ్లినప్పుడు ఫార్మాసిస్టు లేడంటూ నివేదిక రాయడంతోనే సరిపెట్టేస్తున్నారు. ఇక కొన్ని మెడికల్ షాపుల్లో ఏకంగా కిరాణా జనరల్ షాపులను నడిపిస్తుండగా, మరికొన్ని మెడికల్ ల్యాబ్‌లు, ప్లాజాలుగా, ఎక్కడి నుంచో వచ్చే కన్సల్టెన్సీ డాక్టర్లు నడిపే క్లినిక్‌లుగా పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటికి లైసెన్సు ఉండదు. డీఎంహెచ్‌ఓ అథారిటీ తరఫున పర్మిషన్లు ఉండవు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోరన్న విమర్శలు ఉన్నాయి.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

గ్రామాల్లోని వారు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తుంటారు. వీరు వాస్తవానికి ఇంజెక్షన్ చేయడం గానీ, యాంటీబయాటిక్ ఇవ్వడం గానీ చేయకూడదు. కానీ బ్యాన్డ్ డ్రగ్, ఎక్స్పైరీ డ్రగ్ కూడా వీరి ద్వారానే చేరి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆమదాలవలసలో ఇలానే ఓ ఎస్‌ఐ కింద పనిచేసే డ్రైవర్ చనిపోయారు. ఇదే ఆర్‌ఎంపీలకు జిల్లాలో కొంతమంది డీలర్లు, డీలర్లకు మెడికల్ రిప్రజెంటేటివ్‌లు, రిప్రజెంటేటివ్‌లకు కొన్ని కంపెనీలు డ్రగ్ శాంపిళ్లను ఓ లింక్ సిస్టమ్‌లా చేర్చుతూ సొమ్ము చేసుకుంటున్నాయి. జిల్లాకేంద్రంలోని చినబరాటం వీధిలో ఓ డీలర్ ఇంట్లో ఇలానే శాంపిళ్లు దొరికాయి. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు తక్కువ ధరకే మందులను అందించాలనే లక్ష్యంతో మొదలుపెట్టిన జనరిక్ మందుల దుకాణాలు జిల్లాలో మూసుకునే పరిస్థితికొస్తున్నాయి. వాస్తవానికి పదిరూపాలకు దొరికే కంపెనీ డ్రగ్, ఈ షాపుల్లో రూ.2 కే దొరుకుతుంది. కానీ ఎవరూ కొనడం లేదు.

అన్నీ పరిశీలిస్తాం..

మ్యాన్‌పవర్ లేని మాట వాస్తవమే. మా పేరుతో ఎవరైనా షాపుల వద్ద దందాలు నడిపినా, వసూళ్లు చేసినా సహించేది లేదు. నా దృష్టికి ఇప్పటివరకు రాలేదు. వెరిఫై చేస్తాం. ఆధారాలుంటే చర్యలు తీసుకుంటాం. నేనొచ్చాక ఇయర్లీ ఫార్మాలిటీ అనే మాటే లేదు. ఇటీవల కేంద్రం జీఎస్టీలో మార్పులు ప్రకటించిన మరుసటి రోజే జిల్లావ్యాప్తంగా స్టిక్కర్లు అంటించేలా చూశాం. అదే రోజు నిబంధనలు లేని షాపులను మూసేశాం. జిల్లాలో 15 ప్రభుత్వ జనరిక్ షాపులు నడుస్తున్నాయి. – చంద్రరావు, జిల్లా ఔషధ నియంత్రణాధికారి

దగ్గు సిరప్‌ల దుర్వినియోగం..



డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌తో ఇవ్వాల్సిన నిద్ర మాత్రలు, దగ్గు సిరప్‌లను కొన్ని షాపులు దుర్వినియోగం చేస్తున్నాయి. కొందరు అక్రమార్కులు సర్జికల్ స్పిరిట్‌ను కల్తీ మద్యంలో వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉండటంతో ఇటీవల ఎక్సైజ్ అధికారులు కొన్ని ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో స్పిరిట్ బయటకు వెళ్లరాదని నోటీసులు కూడా ఇచ్చారు. మొన్నటికి మొన్న ఈగిల్ టీమ్ పేరుతో రాష్ట్రంలో అన్ని మెడికల్ షాపుల మీద దాడులు చేసినట్టే మన జిల్లాలోనూ డ్రగ్, విజిలెన్సు, తూనికలు, కొలతలు, ఫుడ్ ఇన్‌స్పెక్షన్, పోలీసు విభాగాలు సంయుక్తంగా దాడులు చేశాయి. దాదాపు పదికి పైగా షాపులు తనిఖీల్లో అవకతవకలున్నట్లు బయటపడ్డాయి. అక్కడికి కొద్దిరోజుల్లోనే సస్పెండ్ నోటీసులు ఇవ్వడం, అదే రోజు కొంత మొత్తంలో డబ్బులు తీసుకుని క్లోజ్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా దసరా, దీపావళి మామూళ్లంటూ మెడికల్ షాపులపై పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇయర్లీ ఫార్మాలిటీ కింద రేట్లు కూడా నిర్ధారిస్తున్నారు.


మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ తనిఖీలు



తనిఖీల్లో భాగంగా కెమికల్ టెస్టు చేస్తున్న సీఐ గోపాలకృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 34 మద్యం దుకాణాలను ఆదివారం అధికారులు తనిఖీ చేశారు. దుకాణాల్లో కొన్ని మద్యం బ్రాండ్లను స్పాట్ కెమికల్ టెస్టు నిర్వహించి వాటిని ఎనాలసిస్ చేసేందుకు విశాఖపట్నం ల్యాబ్‌కు తరలించారు. ఈ మేరకు సీఐ ఎం.వి.గోపాలకృష్ణ వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నుంచి 367 శాంపిల్స్ ల్యాబరేటరీకి పంపి వాటి నివేదికలను తెప్పించామని, వాటి ఆధారంగా ఏపీఎస్‌బీసీఎల్ నుంచి సరఫరా అవుతున్న మద్యం పూర్తి నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్నట్లుగా నిర్ధారణ అయ్యిందన్నారు. మద్యం అమ్మకాల్లో ఎలాంటి తప్పిదాలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నౌకరీనామాదారులను హెచ్చరించామన్నారు. అక్రమ మద్యం విక్రయాల గురించి సమాచారం తెలిస్తే 14405కి ఫిర్యాదు చేయాలన్నారు.

పగలు డంప్.. రాత్రి జంప్!



మశాఖపురంలో కూటమి నాయకుడు డంప్ చేసిన ఇసుక (ఇన్‌సెట్లో) అధికారుల హెచ్చరికను బేఖాతరు చేసి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న దృశ్యం

- దర్జాగా కూటమి నేత ఇసుక దందా
- నది పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ డంప్
- అధికారులు తనిఖీ చేసినా ఫలితం శూన్యం

ఇచ్ఛాపురం రూరల్: బాహుదా నది పరివాహక గ్రామాల్లో ఇసుక అక్రమ దందా దర్జాగా సాగుతోంది. రాత్రికి రాత్రి ట్రాక్టర్లలో ఊరు దాటించి విక్రయిస్తున్నారు. అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఇసుకాసురుల దందాకు అడ్డే లేకుండా పోతుంది. మశాఖపురం గ్రామానికి చెందిన ఓ కూటమి నాయకుడు వారం రోజుల పాటు సుమారు నాలుగు వందల ట్రాక్టర్ల లోడుల ఇసుకను బాహుదా నది నుంచి డంప్ చేసి నదీ పరివాహక ప్రాంతంలో భద్రపరిచాడు. ఒక్కో ట్రాక్టర్ లోడును రూ.1500 నుంచి రూ.2వేల వరకు అమ్మకానికి బేరం కుదిర్చారు. ఈ విషయమై గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంలో శనివారం మండల రెవెన్యూ అధికారి చిరంజీవి సాహు, వీఆర్వో పటాన తారకేశులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇసుక రీచ్‌ను పరిశీలించి కూటమి నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విజిలెన్స్ అధికారులు సోమవారం వస్తారని, అప్పటి వరకు ఇసుక రీచ్‌లను ముట్టుకోవద్దని ఆదేశాలు జారీ చేశారు. కానీ కూటమి నాయకుడు దౌర్జన్యంగా ఆదివారం సాయంత్రం నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రహస్య ప్రాంతానికి తరలించడంతో గ్రామస్తులు మరోమారు తహసీల్దార్ కార్యాలయానికి ఫోన్ ద్వారా సమాచారం అందించినప్పటికీ ఫలితం కనిపించలేదు.

అధికారులకు సమాచారం అందించాం

స్థానికుల ఫిర్యాదు మేరకు మశాఖపురం గ్రామంలో అనధికారికంగా సుమారు 400 ట్రాక్టర్ల లోడుల అక్రమ ఇసుక ఉన్నట్లు స్వయంగా గుర్తించాం. ఇప్పటికే సంబంధిత విజిలెన్స్ మైన్స్ అధికారులకు సమాచారం అందించాం. ఇసుక రీచ్‌లను ముట్టుకోవద్దని సంబంధిత వ్యక్తికి హెచ్చరించాం. ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– చిరంజీవి సాహు, మండల రెవెన్యూ అధికారి, ఇచ్ఛాపురం

ప్రజల సమస్యలు ప్రబలం



నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధి సత్యవరంలో మహిళలు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఐదు రోజులుగా కుళాయి నీరు రావడం లేదని, ట్యాంకుల ద్వారా ఇస్తున్న నీరు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - నరసన్నపేట

చందా.. దందా!

- రణస్థలం ఎక్సైజ్ శాఖ పరిధిలో చందా పేరున భారీగా దందా
- ఒక్కో బెల్ట్ షాప్ నుంచి రూ.6వేలకు పైచిలుకు వసూలు
- రణస్థలం ఎక్సైజ్ శాఖలో దుమారం



రణస్థలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం

రణస్థలం:

దసరా చందా పేరుతో రణస్థలం ఎక్సైజ్ శాఖలో జరిగిన వసూళ్ల పర్వంపై సర్వత్రా తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈ వసూళ్లు లావేరు, రణస్థలం మండలాల్లోని మందుబాబుల నోళ్లలో టాక్ ఆఫ్ ది ఎక్సైజ్ శాఖలా మార్మోగుతున్నాయి. ఏ బెల్ట్ షాపునకు వెళ్లినా క్వార్టర్ బాటిల్‌పై రూ.50 అదనంగా వసూలు చేసే నిర్వాహకులు ప్రస్తుతం రూ.60 నుంచి రూ.వంద వరకు పెంచారు. ఎందుకీ పెంపు అని అడిగితే ఎక్సైజ్ అధికారులకు మామూలిచ్చాం అని చెబుతున్నారు. రణస్థలం, లావేరు మండలాల పరిధిలోని రణస్థలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో ఈ కలెక్షన్ల పర్వం జోరుగా సాగింది. గత ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడపడం వల్ల వసూళ్లు పెద్దగా ఉండేవి కావు. కానీ కూటమి పాలన రావడంతో మళ్లీ మద్యం దుకాణాలు ప్రైవేటుపరమయ్యాయి. దీంతో ఎక్సైజ్ శాఖకు నూతనోత్సాహం వచ్చింది.

గత ఏడాది దసరా ముందే బదిలీలపై వచ్చిన అధికారులు బెల్ట్ షాప్‌నకు వెయ్యి రూపాయల చొప్పున దండుకుని సరిపెట్టుకున్నారు. కానీ ప్రస్తుతం ఒక్కొక్క బెల్ట్ షాపు నుంచి రూ.6వేల నుంచి రూ.10వేలు వరకు వసూలు చేయడంతో విషయం రెండు మండలాల్లో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారిపోయింది. ఇలా రూ.6లక్షలకు పైగా వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు

రణస్థలం ఎక్సైజ్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి ఇరువైపులా ఉన్న కిరాణా షాపుల్లో బెల్టు నడుస్తోంది. అలాగే రామ తీర్థాలు కూడలికి సమీపంలో రెండు బెల్టు దుకాణాలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోనూ బెల్టు షాపు ఉంది. వీటన్నంటి దగ్గరా వసూళ్లు జరిగాయి. కమ్మసిగడాం, పైడిభీమవరం, కోష్ట, కోటపాలెం, మత్స్యకార గ్రామాలతో పాటు లావేరు మండలంలోని బుడుమూరు సంత, లావేరు, బెజ్జిపురం, కొత్తకుంకాం, తామాడ, వెంకటాపురం గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపుల నిర్వాహకుల నుంచి రూ.4వేలు నుంచి రూ.10వేలు వరకు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అలాంటిదేమీ లేదు

బెల్టు, మద్యం షాపుల వద్ద దసరా వసూళ్లు వంటివేవీ లేవు. దీనిపై విచారణ చేస్తాను. అలాంటిదేమీ ఉండదు.

– ఎల్.అనురాధదేవి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ, రణస్థలం

మేఘ సందేశం.. మృత్యు సంకేతం

- జనాలను బలికొంటున్న పిడుగులు
- జాగ్రత్తలు పాటిస్తే మేలంటున్న నిపుణులు



సరుబుజ్జిలి: వర్షాలు తగ్గి చలి పెరిగే కాలం వచ్చేసినా.. జిల్లాకు తుఫాన్లు, పిడుగుల భయం వీడడం లేదు. వర్షాల సమయంలో ఇదివరకు ఎన్నడూ లేనంతగా పిడుగులు పడుతున్నాయి. పొలం పనులకు వెళ్తున్న వారు, పశువులను మేతకు తీసుకెళ్తున్న వారు దీని వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. విలువైన పశు సంపదను కూడా నష్టపోతున్నారు. సరుబుజ్జిలి పాలవలస గ్రామానికి చెందిన గొర్రెల కాపరి దాసరి అప్పన్న చిగురువలస సమీపంలో పిడుగుపాటుకు మృతిచెందాడు. గతంలో బూర్జ మండలం లక్కుపురం పంచాయితీ పణుకుపర్త గ్రామానికి చెందిన 8వ తరగతి చదువుకున్న బాలిక కొంద్రోతు మేఘన పిడుగుకు బలైపోయింది. అదే గ్రామానికి చెందిన మహిళలు మక్క కళ్యాణి, అడపా సుగుణ అస్వస్థతతకు గురయ్యారు. కాసిన్ని జాగ్రత్తలు పాటిస్తే ఈ వైపరీత్యం నుంచి బయటపడగలమని నిపుణులు సూచిస్తున్నారు.

సూచనలివే..

- వర్షం కురిసేటప్పుడు చెట్ల కింద చేరకూడదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చినప్పుడు పొలం పనులు చేయకపోవడం ఉత్తమం.
- మెరుపు కనిపించిన తర్వాత 30 సెకన్లలో లేదా అంతకన్న తక్కువ సమయంలో ఉరుము వినిపిస్తే మనకు 10 కిలోమీటర్ల దూరంలోపు పిడుగుపడే అవకాశం ఉంటుంది.
- మెరుపు కనపడిన తర్వాత 30 నిమిషాల పాటు బయటకు వెళ్లే ప్రయత్నం చేయరాదు.
- గొడుగులపై లోహపు బోల్టులు, చేతుల్లో సెల్‌ఫోన్లు లేకుండా చూసుకోవాలి. సెల్‌ఫోన్ ఉంటే స్విచ్ఛాఫ్ చేయాలి.
- వర్షం పడే సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఆ సమయంలో చెప్పులు లేకుండా బయటకు వెళ్లరాదు.

ప్రథమ చికిత్స చేయాలి



పిడుగుపాటుకు గురైన వ్యక్తిని వెంటనే పొడి ప్రదేశంలో పడుకోబెట్టాలి. తడిబట్టలు తీసివేయాలి. తలను ఒక పక్కకు తిప్పాలి. రెండు కాళ్లను ఒక అడుగుపైకి ఎత్తాలి. గాలి తగిలే ప్రదేశంలో ఉంచి అవసరమైతే నోటి ద్వారా గాలి ఊది ప్రథమచికిత్స చేయాలి. సకాలంలో ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించాలి.

– యండ భవ్యశ్రీ, వైద్యాధికారి, సరుబుజ్జిలి

ఐటీఐలో ఖాళీ సీట్ల భర్తీకి ఆఖరి విడత నోటిఫికేషన్ వెల్లడి


శ్రీకాకుళం న్యూకాలనీ: ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి ప్రభుత్వం ఎట్టకేలకు చర్యలు చేపట్టింది. మిగులు సీట్ల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఐదవ, ఆఖరి విడత అడ్మిషన్లకు ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు శ్రీకాకుళం డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్‌మోహనరావు తెలిపారు. దరఖాస్తులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి ఆఖరు తేదీ అక్టోబర్ 16వ తేదీ మధ్యాహ్నం 2 గంటలని, దరఖాస్తుల వెరిఫికేషన్ ఆగస్టు 16, కౌన్సెలింగ్ అక్టోబర్ 16వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జరుగుతుందని ఏడీ రామ్‌మోహన్ పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 95051 61701, 99639 45259 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

అమ్మ సేవలో..



లొద్దపుట్టి ధనరాజులమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొఠారీ గ్రామంలో నిర్వహించిన సంబర మహోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొని అమ్మవారి గజముద్ద మోశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్ దుక్క ధనలక్ష్మి పాల్గొన్నారు. - ఇచ్ఛాపురం రూరల్

మాణిక్యపురంలో 11 మందిపై వీధికుక్క దాడి



కవిటి: మండలంలోని మాణిక్యపురంలో గడిచిన రెండు రోజులుగా వీధికుక్క దాడిలో 11 మంది ప్రజలు తీవ్ర గాయాలపాలయ్యారు. ఊరిలో ఉన్న చికెన్ సెంటర్ల వద్ద మాంసం వాసనకు అలవాటు పడిన వీధి కుక్కలు ప్రజల్ని కూడా తీవ్రంగా వెంటాడి దాడి చేస్తున్నట్లు స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. వీరంతా సోంపేట సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సంతబొమ్మాళి: మండలంలోని లక్కీవలస పంచాయతీ గెద్దలపాడు గ్రామానికి చెందిన తుంబల చిరంజీవి (25) అనే మత్స్యకార యువకుడు శనివారం రాత్రి రాజమండ్రిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అక్కడ ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్న చిరంజీవి ఇటీవలే స్వగ్రామం వచ్చాడు. పది రోజుల కిందట తిరిగి రాజమండ్రి వెళ్లిపోయాడు. బైక్‌పై వెళ్తూ లారీని ఓవర్ టేక్ చేయబోయి అదే వాహనం కిందపడి మృతి చెందాడు. కుమారుడి మరణ వార్త విని తండ్రి గురువులు, తల్లి ఆదెమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు.

జాతీయ పోటీల్లో రాజశేఖర్ 'పవర్'



గార: కొర్ని గ్రామానికి చెందిన చమల్ల రాజశేఖర్ జాతీయ పోటీల్లో విజయ దుందుభి మోగించాడు. ఇటీవల బెంగళూరులో జరిగిన నేషనల్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ – 2025 పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించి శభాష్ అనిపించాడు. ఫుల్ పవర్‌లిఫ్టింగ్, పుష్‌పుల్, బెంచ్‌ప్రెస్ విభాగాల్లోనూ స్వర్ణ పతకాలు సాధించాడు. గతంలోనూ ఇండియన్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జంషెడ్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలల్లో పతకాలు సాధించిన విషయం తెలిసిందే. యువ క్రీడాకారుడి ప్రతిభ పట్ల ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాధికారులు హర్షం వ్యక్తంచేశారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



పట్టాలపై మృతదేహం

పలాస: బారువ–మందస రైల్వేలైన్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియన వ్యక్తి మృతి చెందినట్టు పలాస జి.ఆర్.పి ఎస్ఐ కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. మృతుడి ఛాతిపై 'ఐ లవ్ యు స్వాతి' అని తెలుగులో రాసిన పుట్టుమచ్చ ఉందన్నారు. వివరాలు తెలిస్తే 9440627567 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు



ఎంపికైన ప్రాబబుల్స్ జట్టుతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో గెలుపే లక్ష్యంగా సత్తాచాటాలని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర/జిల్లా ప్రధాన కార్యదర్శి సూర శ్రీనివాసరావు ఆకాంక్షించారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్స్ పురుషుల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో జరిగాయి. అనంతరం 20 మందితో కూడిన ప్రాబబుల్స్ జట్టును ఎంపికచేశారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల వేదికగా నవంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్స్ పురుషుల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్–2025 పోటీలు జరగనున్నాయని ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ కన్వీనర్, సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ తెలిపారు. ఇక్కడ ఎంపికచేసిన ప్రాబబుల్స్ జట్టుకు ఈ నెల 28 నుంచి నవంబర్ 6 వరకు ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జెడ్పీహెచ్ స్కూల్ వేదికగా శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారు పి.సుందరరావు, గ్రిగ్స్‌మీట్ సెక్రటరీ కె.మాధవరావు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు మెట్ట తరుపతిరావు, ఎం.ఆనంద్ కిరణ్, ఎ.డిల్లేశ్వరరావు, గురుగుబెల్లి రాజ శేఖర్, జి.మల్లేష్, ఎస్.గణపతిరావు, ఎస్.రామరాజు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న పీచు

- టన్ను పీచు ధర రూ.10 వేలు నుంచి రూ.20 వేలు
- ఉద్దానం నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతులు
- కొబ్బరి పీచు, తాళ్లకు డిమాండ్



పెద్దమురహరిపురంలో ఉన్న పీచు పరిశ్రమ

వజ్రపుకొత్తూరు: కోనసీమ తర్వాత కొబ్బరి చెట్లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఉద్దానంలో ఉత్పత్తి అవుతున్న కొబ్బరిపీచుకు మంచి గిరాకీ ఉంటోంది. ఇక్కడి పరిశ్రమల్లో తయారైన పీచు, తాడు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు భారీ ఎత్తున ఎగుమతి అవుతోంది. పొరుగునే ఉన్న విజయనగరంతో పాటు హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, పంజాబ్, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు వంటి రాష్ట్రాలకు పీచు, తాడు ఉత్పత్తులు పంపిస్తున్నారు. జిల్లాలో అటు రణస్థలం నుంచి ఇటు ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, వజ్రపుకొత్తూరు, మందస, సంతబొమ్మాళి, పలాస తదితర 29 మండలాల్లో 15 వరకు పీచు పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ రోజుకు 120 టన్నుల వరకు పీచు ఉత్పత్తి జరుగుతోంది.

తయారీ ఇలా..

జిల్లాలో 32,602 ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తుండగా నెలకు సరాసరి 32,60,000 కాయలు దిగుబడి వస్తున్నాయి. కొబ్బరికాయల డొక్కలు 30 శాతం వృథాగా పోతుండగా.. పరిశ్రమ నిర్వాహకులు అవసరమైన డొక్కలను రైతుల నుంచి కొనుగోలు చేసి లారీలతో తరలిస్తున్నారు. వీటిని పరిశ్రమల్లో పెద్ద లాట్‌లుగా కట్టి పది, పదిహేను రోజులు నీటితో తడుపుతారు. అనంతరం డీసెండికేటర్‌లో కొబ్బరి డొక్కలు వేస్తే పీచులా మారుతుంది. దానిని ఎండబెట్టి ఎగుమతులకు సిద్ధం చేస్తారు. కర్లింగ్ పీచు కొనుగోలు చేసుకుని కర్లింగ్ మెషీన్‌ల ద్వారా రెండు రకాల తాడును తయారు చేస్తారు. ప్రస్తుతం పీచు ధర టన్ను రూ.10వేలు ఉంది. కర్లింగ్ పీచుకు రూ.20 వేలు ధర లభిస్తోంది. 2014 వరకు కొబ్బరి పీచును చైనాకు అధికంగా ఎగుమతి జరిగేది. ఐతే పరుపుల తయారీకి ఫోం అందుబాటులోకి రావడంతో పీచుకు డిమాండ్ తగ్గింది. దేశీయంగా మాత్రం వినియోగం పెరిగింది. వినాయకుడు, దేవీ విగ్రహాల తయారీలో దేశ వ్యాప్తంగా కొబ్బరి పీచునే వినియోగిస్తుండటంతో గిరాకీ పెరుగుతోంది.

బోట్లు, ఇటుకలు తయారీకిలోనూ..

ప్రధానంగా బోట్లు తయారీలో కొబ్బరి పీచు వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్, కొబ్బరి పీచును వినియోగించి బోట్లు రూపొందిస్తారు. విశాఖ, కాకినాడ, చెన్నై, ముంబై, కోల్‌కత్తా, కేరళ తదితర ప్రాంతాల్లో చేపల బోట్లతో పాటు రవాణా, టూరిజం బోట్ల తయారీలో కొబ్బరి పీచు వినియోగిస్తారు. పీచు తయారీలో పొట్టు కూడా వస్తుంది. దీనిని కంపోస్టు, ఇటుకల తయారీలో వినియోగిస్తున్నారు. ఫాక్టరీల వద్దే నేరుగా కంపోస్టు ఎరువు తయారు చేసి నర్సరీలకు ఎగుమతి చేస్తున్నారు. కంపోస్టు ఎరువు టన్ను రూ.5వేలు ధర పలుకుతోంది. ఇటుకల బట్టీల్లోనూ పొట్టు వినియోగిస్తున్నారు. దీని వల్ల ఇటుక తేలికగా ఉంటోంది. ఈ ఇటుక అపార్టుమెంట్ల నిర్మాణంలో బాగా ఉపయోగపడుతోంది. ట్రాక్టర్ లోడుకు రూ.7వేలు ధర లభిస్తోంది.

కర్లింగ్ పీచుకు డిమాండ్..



ఇటీవలే పీచు పరిశ్రమ ప్రారంభించాను. కర్లింగ్ పీచుకు డిమాండ్ ఉంది. అయితే మార్కెట్‌పై పూర్తి స్థాయిలో అవగాహన లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాయిర్ బోర్డు పీచు పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి మార్కెట్ సౌకర్యం మార్గాలను చూపించాలి. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వాలి.

– కె.దేవదాసు, పీచు పరిశ్రమ నిర్వాహకుడు, పెద్దమురహరిపురం

యువత దృష్టి సారించాలి..



ఉద్దానం ప్రాంతంలో పెద్ద ఎత్తున కొబ్బరి డొక్కలు ఉత్పత్తి అవుతున్నా అందుకు తగ్గస్థాయిలో పరిశ్రమలు లేవు. ఔత్సాహికులు ముందుకు వచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కాయిర్ బోర్డు ద్వారా 35 శాతం సబ్సిడీతో రుణాలు పొందే అవకాశం ఉంది. నిరుద్యోగ యువత ఈ పరిశ్రమలపై దృష్టి సారించాలి. ఇచ్ఛాపురం కొబ్బరి పొట్టుతో ఇటుకలు తయారు చేసే పరిశ్రమ సైతం ఉంది. మంచి లాభాలు సైతం ఆర్జిస్తున్నారు. కాయిర్ బోర్డు, మా సహకారం తీసుకుని ముందుగా దీనిపై అవగాహన పెంచుకుని నాబార్డు, ఇతర సంస్థలు ద్వారా రుణాలు పొంది పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి.

– సీహెచ్.శంకర్‌దాసు, ఉద్యానవన శాఖ అధికారి , పలాస



కర్లింగ్ పీచును వేరు చేస్తున్న యంత్రం



ఇటుకల పరిశ్రమకు ఎగుమతికి సిద్ధంగా ఉంచిన పొట్టు

వైఎస్సార్ సీపీ పాలనలోనే కళింగవైశ్యులకు గుర్తింపు

- చంద్రబాబువి ఓటుబ్యాంకు రాజకీయాలు: కరిమి రాజేశ్వరరావు
- గత ప్రభుత్వంలోనే ప్రశాంతంగా వ్యాపారాలు: అంధవరపు సూరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కళింగవైశ్య కుల బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు. పక్కనే డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

సీఎం చంద్రబాబు కళింగవైశ్యుల్ని ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారే తప్ప కళింగవైశ్య కులంలో ఏ ఒక్కరికి చెప్పుకోదగ్గ పదవిని ఇచ్చిన సందర్భాలు లేవని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల పరిశీలకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ కల్యాణ మండపంలో కళింగవైశ్య కుల బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర కళింగ వైశ్య వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కళింగవైశ్యులకు జిల్లా నుంచి సుడా చైర్మన్, కళింగవైశ్యకుల కార్పొరేషన్ చైర్మన్, 10 మంది డైరెక్టర్లు, ఏఎంసీ చైర్మన్, ఎంపీటీసీ వంటి అనేక పదవులిచ్చి తగిన గుర్తింపునిచ్చారన్నారు. గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయేలా జిల్లాలో పలు అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. కళింగ వైశ్యులంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటారని, మోసకారి టీడీపీని పక్కనపెట్టాలని పిలుపునిచ్చారు.

– వైఎస్సార్ సీపీ కళింగ వైశ్య కుల బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ కళింగవైశ్యులంతా ఏకతాటిపైకి వచ్చి వైఎస్సార్‌సీపీ గెలుపునకు సైనికుల్లా పనిచేద్దామన్నారు. దివంగత రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిలతోనే కళింగవైశ్యులకు తగిన గుర్తింపు లభించిందన్నారు. 56 కార్పొరేషన్‌లు ఏర్పాటుచేసి చైర్మన్ పదవులిచ్చి బీసీలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. పేదలకు నాణ్యమైన వైద్య విద్య నందించాలన్న ఆలోచనలతో జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలకు నిర్ణయించి 5 కాలేజీలు ప్రారంభిస్తే మిగిలిన వాటిని చంద్రబాబునాయుడు ప్రయివేటువ్యక్తులకు అప్పగించడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క వ్యాపారికీ ఇబ్బందులు కలగలేదన్నారు. ప్రజలందరి వద్ద డబ్బులు ఉండటంతో వ్యాపారాలు సక్రమంగా జరిగేవన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. కళింగవైశ్యులంతా చాలా శక్తివంతులని, ప్రతి ఒక్కరు బాగా పనిచేసి భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీ గెలుపులో కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పార్టీకోసం పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

– వైఎస్సార్‌సీపీ కళింగవైశ్య కుల ఉత్తరాంధ్ర నాయకులు సకలాభక్తుల ప్రసాదరావు, తంగుడు నాగేశ్వరరావు, పి.వి.మల్లా గుప్తా, ఎరుకోల వెంకటరావు, తండుగు జోగారావు, యుగంధర్, తాళాసు సాయిమోహన్, కొంచాడ రాజాశ్రీకాంత్, గుడ్ల శ్రీనివాసరావు, కింతలి తిరుమలకుమార్, పొట్నూరు సాయిప్రసాద్, పి.వి.సతీష్, సూరు సాయిరాం, అంధవరపు బాలకృష్ణలు మాట్లాడుతూ ఒక్కో కళింగవైశ్యుడు వంద మంది ఓటర్లని తయారు చేయగలిగేలా సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కాళింగ కుల బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణ రావు, వెలమ కుల రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రౌతు శంకరరావు, కళింగవైశ్యకుల నాయకులు అంధవరపు రమేష్, బరాటం సంతోష్, వడ్డి ఉదయ్, గుడ్ల దామోదరరావు, ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

డిజిటల్ మారథాన్‌కు రెడీ

- 'ఆంధ్రా యువ అంబాసిడర్' ఎంపికలకు పోటీలు
- షార్ట్‌వీడియోలకు ఆహ్వానం
- విజేతలకు భారీగా నగదు బహుమతులు

ఆంధ్ర యువసంకల్ప్ 2కే25 లోగో

శ్రీకాకుళం న్యూకాలనీ :

వికసిత్ భారత్ – 2047 లక్ష్యాలను సాధించేలా యువతను ఆకర్షించేందుకు యువజన సర్వీసుల శాఖ నడుంబిగించింది. దీనిలో భాగంగా సామాజిక, కుటుంబ సంబంధాలతోపాటు ఆరోగ్యకరమైన జీవన వైవిధ్యాన్ని తెలియజేస్తూ డిజిటల్ ఆవిష్కరణల విలువలను ప్రోత్సహించి ప్రజలను మేల్కొలిపేలా షార్ట్‌వీడియోను తయారు చేసేందుకు యువతకు అవకాశం కల్పించారు. ఇందులో విజేతలకు ఆంధ్ర యువత అంబాసిడర్‌గా ప్రకటించడంతో పాటు భారీగా నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నారు. ఈ మేరకు 'ఆంధ్ర యువ సంకల్ప్ 2కే25 (ఆంధ్ర యువ 2కే25 అంబాసిడర్)' డిజిటల్ మారథాన్‌లో యువత భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిస్తున్నారు.

ఎలా పాల్గొనాలంటే..

- ఆంధ్ర యువ అంబాసిడర్ పోటీల్లో పాల్గొనేందుకు 18 నుంచి 35 ఏళ్ల యువతీ యువకులు అర్హులు.
- 'ఆంధ్రాయువసంకల్ప్.కామ్' వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేరుకోవాలి. ఇందుకు ఈ నెల 15తో గడువు ముగియనుంది.
- పోటీల్లో పాల్గొనేవారు 120 సెకన్ల నిడివిగల వీడియో/షార్ట్‌ను తయారుచేసి, నిర్దేశిత అధికారిక హ్యాష్‌ట్యాగ్‌లతో వారి సొంత సోషల్ మీడియా ఖాతాలలో (ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ షార్ట్స్ మొదలైనవి) పోస్ట్ చేయాలి.
- జ్యూరీ కమిటీ తమకు వచ్చిన ఎంట్రీలను సమీక్షించి విజేతలను ప్రకటిస్తుంది.

బహుమతులు, సర్టిఫికెట్లు..

అంబాసిడర్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.1,00,000, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.75,000, తృతీయ స్థానంలో నిలిచినవారికి రూ.50,000 నగదు బహుమతులు అందజేస్తారు. మొదటి తొమ్మిది మంది విజేతలకు 'ఆంధ్ర యువ సంకల్ప్ 2కే25 అంబాసిడర్'గా గౌరవ సత్కారం అందజేస్తారు. పోటీలలో భాగస్వామ్యమైన ప్రతి ఒక్కరికీ డిజిటల్ క్రియేటర్ ఏపీ 2కే25 పేరిట సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

గొప్ప అవకాశం..

యువత తమలో ఉండే సృజనాత్మకతను నిరూపించుకునేందుకు చక్కటి అవకాశం. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా వివిధ అంశాల్లో ప్రజలను మేల్కొలిపేలా వీడియోను సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్నవారి వీడియోలను జ్యూరీ కమిటీ పరిశీలించి ఎంపికచేస్తుంది.

– వావిలపల్లి వెంకటప్పలనాయుడు, సెట్‌శ్రీ సీఈఓ

ప్రతిభ నిరూపించుకోవాలి..

జిల్లా యువత అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. టాలెంట్ నిరూపించుకునేందుకు ఇదొక చక్కటి అవకాశం. డిజిటల్ మారథాన్‌లో పాల్గొని ప్రతిభ చాటుకోవాలి. అత్యధిక మంది భాగస్వాములై శ్రీకాకుళం జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలి.

– కె.వెంకట్ ఉజ్వల్, మేరాభారత్ డిప్యూటీ డైరెక్టర్

మీకు తెలుసా?



అరసవల్లిలో భగళాముఖి అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్ : ప్రత్యక్ష దైవం సూర్యనారాయణ స్వామి కొలువుదీరిన అరసవల్లిలోనే భగళాముఖి అమ్మవారు ప్రత్యేకంగా పూజలందుకుంటున్నారు. ప్రస్తుత తరంలో చాలామందికి ఈ విషయం తెలియదనే చెప్పాలి. సూర్యనారాయణ స్వామి ఆలయంలో మూలవిరాట్ మందిరానికి ఆనుకొని ఉన్న దుర్గాదేవిని భగళాముఖి అమ్మవారుగా పిలుస్తారు. ప్రత్యక్ష నారాయణుని దర్శించుకున్న తరువాత బయటకు వస్తే మనకి తీర్థం ఇచ్చి శఠగోపం పెడతారు. అక్కడే ఈ అమ్మవారు కొలువుదీరారు. భగళాముఖి అమ్మవారికి ఇద్దరు అక్కచెల్లెళ్లు ఉన్నారు. వారే జలుమూరులో కొండపైన ఉన్న ఇంద్రాణి అమ్మవారు, శ్రీముఖలింగంలో వారాహి అమ్మవారు. అరసవల్లిలో శక్తిస్వరూపిణిగా ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు, నిత్యపూజలు అందుకుంటారు.

పంచాయతన ఆలయంగా అరసవల్లి..

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని పంచాయతన ఆలయంగా పిలుస్తారని మీకు తెలుసా!. ఎందుకంటే అక్కడ ఆదిత్యుడు, అంబిక, విష్ణు, గణనాథుడు, మహేశ్వరుడు కలసి ఉన్నారు. అందుకే ఈ ఆలయాన్ని పంచాతయన ఆలయంగా కొలుస్తారనిప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ తెలిపారు. ఆదిత్యుడికి రథసప్తమి వేడుకలు, ఈశ్వరుడికి శివారాధన, శివరాత్రి, కార్తీక మాస ఉత్సవాలు జరుగుతాయి. వినాయకుడికి గణపతి ఉత్సవాలు, నిత్య పూజలు నిర్వహించారు. విష్ణుతత్వంగా మార్గశిర మాసంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఇలా అనేక ప్రత్యేకతలతో అరసవల్లి ఆదిత్యాలయం విరాజిల్లుతోంది.

జ్ఞాపకాల 'బడి'లో..



తిమడాం ఉన్నత పాఠశాలలో 1981–86 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరునొకరు పలకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు పొడుగు సత్యనారాయణ, వెలమల సత్యనారాయణ, తోట శ్రీరామూర్తి, కొర్ను చిన్నప్పల నాయుడు, పి.రాములును ఘనంగా సన్మానించారు. తమ గుర్తుగా ఫ్యాన్‌లు వితరణ చేశారు.

– జలుమూరు

మా కష్టాలు.. కనపడవా?

- నది దాటాలంటే నాటు పడవే దిక్కు
- ప్రమాదకరంగా ప్రయాణం



జిల్లోడిపేట గ్రామస్తులు గొడుగులతో పడవపై ప్రయాణిస్తున్న దృశ్యం

హిరమండలం: కల్లట పంచాయతీ పరిధిలోని జిల్లోడిపేట, కల్లట గ్రామాల మధ్య మహేంద్రతనయ నదిపై పడవ ప్రయాణాలు ప్రమాదకరంగా సాగుతున్నాయి. జిల్లోడిపేట గ్రామస్తులు పనులపై ఎక్కడికి రాకపోకలు సాగించాలన్నా నాటుపడవపై నది దాటాల్సిందే. మండలకేంద్రానికి వెళ్లాలన్నా, బడికి వెళ్లాలన్నా రోజూవారీ పడవ ప్రయాణం తప్పదు. ప్రస్తుతం గ్రామంలో పదుల సంఖ్యలో విద్యార్థులు 6 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్నారు. వీరంతా పడవలోనే అవలంగి, హిరమండలం, పాతపట్నం వెళ్తుంటారు. వంతెన లేకపోవడంతో ప్రమాదకర పరిస్థితుల్లో పడవపై ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుతుంటారు.

వంతెనకేదీ మార్గం?

ఇక్కడ వంతెన నిర్మించాలని దశాబ్దాలుగా జిల్లోడిపేట గ్రామస్తులు పోరాడుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. 2014 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి శత్రుచర్ల విజయరామరాజు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అది ఎన్నికల స్టంట్‌గా మిగిలిపోయింది. అటు తరువాత 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కూడా మరోసారి వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి హడావుడి చేసింది. తర్వాత పనులు చేయకుండా చేతులెత్తేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఇంతలో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. గత అనుభవాల దృష్ట్యా , ముందున్న ప్రభుత్వ చర్యలు పుణ్యమా అని కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో నిధులు మంజూరు చేసినా ఫలితం లేకపోయింది. తాము అధికారంలోకి వస్తే జిల్లేడుపేట వద్ద వంతెన నిర్మాణం చేపడతామని స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిత్యం ఇబ్బందులే..



ప్రమాదకర స్థితిలో మహేంద్రతనయా నదిని దాటుతున్నాం. నదిలో నీటి ఉధృతి అధికంగా ఉండే సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. ఆ సమయంలో గ్రామానికే పరిమితం కావాల్సి ఉంటోంది.

– రావాడ అమ్మన్న, జిల్లోడిపేట

వంతెన నిర్మించాలి..



వర్షాకాలంలో మా అవస్థలు వర్ణించలేనివి. ఒక్కోసారి మూడు నెలలకోసారి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితులు దాపురిస్తాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలి.

– కొర్ను ధనుంజయరావు, జిల్లోడిపేట

ఆర్.బెలగాం యువకుడి ప్రతిభ



మహారాష్ట్ర సీఎం చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న సుమిత్‌కుమార్

కవిటి: ఆర్థిక రాజధాని ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో భారత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్వెస్ట్–2025లో కవిటి మండలం ఆర్.బెలగాం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ రత్నాల సుమిత్‌కుమార్ సత్తాచాటాడు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీలో బ్యాంక్ లావాదేవీలు, పేమెంట్ డేటా, రియల్ టైమ్ ఫ్రాడ్ డిటెక్షన్ తదితర సమస్యల పరిష్కారంపై ఆన్‌లైన్ టెస్ట్, కోడ్ అండ్ డేటా సైన్స్ చాలెంజ్, అడ్వాన్స్‌డ్ ఏఐ వర్క్ షాప్ తదితర విభాగాల్లో సుమిత్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా మహారాష్ట్ర సీఎం చేతుల మీదుగా రూ.5 లక్షల నగదు, అవార్డు శనివారం అందుకున్నారు. రత్నాల కామేశ్వరరావు, ప్రమీల దంపతుల కుమారుడు సుమిత్‌కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని కేఎంఐటీలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. యువకుడి విజయం పట్ల కవిటి మండల సొండికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాండవ రామారావు హర్షం వ్యక్తం చేశారు.

ట్రిపుల్ ఐటీలో ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం



విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ సిబ్బంది

ఎచ్చెర్ల : విద్యార్థుల్లో సృజన్మాతకత, ఆవిష్కరణ, సాంకేతిక ప్రతిభను పెంపొందించేందుకు స్థానిక రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్నోవేషన్ అండ్ ఇన్క్యుబేషన్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు.ఆప్షన్‌మేట్ రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, ఆప్షన్ మేట్ మేనేజింగ్ డైరెక్టర్ పి.శశికుమార్, పరిపాలనాధికారి డాక్టర్ మునిరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి సీహెచ్ వాసు, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ గేదెల రవి, అసోసియేషన్ డీన్ కె.రమణ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సి.ప్రకాశ్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ ఇంక్యూబేషన్ ఎస్.సతీష్ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పొందూరులో విద్యుత్ అదాలత్

అరసవల్లి: ఎచ్చెర్ల సబ్ డివిజన్ పరిధిలోని పొందూరు విద్యుత్ ఏఈ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈ ఎస్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రస్తావించి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.